క్లుప్తంగా

ఎరుకుల హక్కుల సంఘ అధ్యక్షుడు ఏడుకొండలు మృతి


బందారు ఏడుకొండలు(ఫైల్)

అమలాపురం టౌన్: స్థానిక ఏఎంజీ కాలనీకి చెందిన పట్టణ ఎరుకుల హక్కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బందారు ఏడుకొండలు(57) మెదడు సంబంధిత వ్యాధితో ఆదివారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఏడుకొండలు సోదరుడు, స్థానిక కౌన్సిలర్ బందారు గోవిందును పలువురు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎరుకుల హక్కుల కోసం పలు పోరాటాలు, ఉద్యమాలు చేసిన ఏడుకొండలు మృతిపై ఆయన సామాజిక వర్గీయులు ఆవేదనం వ్యక్తం చేశారు. సంతాపం తెలిపినవారిలో ఎరుకుల హక్కుల సంక్షేమ సంఘం ప్రతినిధి ఉప్పు శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిల్ విప్ బందారు సత్యనారాయణ, న్యాయవాది ఆర్.శ్రీనివాసరావు తదితరులున్నారు.

ఎమ్మెల్యే దాట్లకు సత్కారం


ఎమ్మెల్యే దాట్లను సత్కరిస్తున్న ఎంపీపీ రాయుడు సునీత తదితరులు

తాళ్లరేవు: ముమ్మిడివరం నియోజకవర్గం నుంచి నూతనంగా ఎన్నికైన దాట్ల సుబ్బరాజును ఎంపీపీ రాయుడు సునీత ఆదివారం ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే దాట్ల తొలిసారిగా మండల పరిషత్ కార్యాలయానికి విచ్చేయడంతో ఆయన్ను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కుడుపూడి శివన్నారాయణ, ఎంజీ సూర్యనారాయణ, ఉంగరాల వెంకటేశ్వరరావు, రాయుడు గంగాధర్, పొన్నామండ రామలక్ష్మి, పిల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

నీటి ప్రవాహానికి అవరోధం


చల్లపల్లి ప్రధాన పంట కాలువలో ప్రవాహానికి ఆటంకం కలిగిస్తున్న చెట్టు

ఉప్పలగుప్తం: ఇటీవల వీచిన ఈదురు గాలులకు మండలంలో పలు చోట్ల వృక్షాలు నేలకొరిగాయి. ఈ చెట్లు పంట కాలువలో పడటంతో చెత్త చెదారం పేరుకుపోయి నీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తున్నాయి. చల్లపల్లి ప్రధాన పంట కాలువలో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తుంది. ప్రస్తుతం ఖరీఫ్ సాగు నేపథ్యంలో రైతులు నారుమడులు సిద్ధం చేసుకోవడానికి దమ్ము ప్రయత్నాల్లో ఉన్నారు. అయితే పంట కాలువలో అడ్డగింతతో ప్రవాహం తగ్గి పొలాలకు పూర్తి స్థాయిలో సాగునీరు అందటం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

అన్నదాన ట్రస్ట్‌కు బియ్యం వితరణ


నిత్యావసరాలు అందజేస్తున్న సీఐ కొండయ్య దంపతులు

ఐ పోలవరం: మురమళ్లలో కొలువైన వీరేశ్వరస్వామివారి ఆలయ అన్నదాన ట్రస్ట్‌కు ముమ్మిడివరం సీఐ కొండయ్య దంపతులు బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు. ఆదివారం వారు తమ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఈ సందర్భంగా అన్నదాన ట్రస్ట్‌కు 100 కేజీల బియ్యం, పప్పులు, పెరుగు తదితర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో డ్రోన్లు


రైతులకు అవగాహన కల్పిస్తున్న గ్రోమోర్ ప్రతినిధులు

అల్లవరం: వరి పంటని ఆశించే పురుగులు, తెగుళ్ల నివారణకు అమలాపురం పరిసర ప్రాంతాల్లో రైతులకు డ్రోన్లను అందుబాటులో ఉంచామని కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ మన గ్రోమోర్ ప్రతినిధి బాబూరావు అన్నారు. గూడాల సచివాలయం వద్ద సర్పంచ్ దాకారపు చిరంజీవిరావు అధ్యక్షతన రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పంటల్లో వచ్చే సూక్ష్మ ధాతు లోపాలు, వాటి నివారణ మార్గాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కిషోర్‌వర్మ, ఎస్‌పీ సాంబశివరావు, సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

నడక మార్గం.. ఆరోగ్య సూత్రం

ప్రజల్లో ఆరోగ్యంపై చైతన్యాన్ని నింపుతున్న అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్‌లు


అమలాపురంలో నడక పోటీలకు సై అంటున్న సీనియర్ వాకర్స్


ప్రపంచ గుండె పరిరక్షణ దినోత్సవం వేళ అమలాపురం మహిళా వాకర్స్ నడక

అమలాపురం టౌన్: రోజూ క్రమం తప్పకుండా నడిస్తే ఎన్నో అనారోగ్య సమస్యలను దూరం చేయొచ్చని చెబుతుంటారు వైద్య నిపుణులు. పట్టణానికి చెందిన వాకర్స్ హెల్త్ క్లబ్ సభ్యులు నడకకు ప్రాధాన్యమిస్తే అది ఆరోగ్యానికి ఎంతటి రక్షణ కవచంగా నిలుస్తుందో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వాకర్స్ హెల్త్ క్లబ్, మహిళా వాకర్స్ హెల్త్ క్లబ్‌ల సభ్యులంతా అలా చెప్పడమే కాకుండా నిత్యం తెల్లవారకుండానే నడక ప్రారంభించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఏళ్లుగా వారు నూరిపోస్తున్న ఆ చైతన్యంతోనే నిత్యం తెల్లవారగానే పట్టణంలోని రోడ్లు, క్రీడా స్థలాలు, వాకింగ్ ట్రాక్‌లు ఆరోగ్యాభిమానులతో నిండిపోతున్నాయి.

అటు ఆత్మీయం.. ఇటు ఆరోగ్యం

అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ 1996 అక్టోబర్ 6న ఆవిర్భవించింది. అప్పట్లో కొందరు వైద్యులు, న్యాయవాదులు, ఇతర విద్యావేత్తలు, విశ్రాంత అధికారులు, ఉద్యోగులు కలిసి రోజూ ఉదయాన్నే నడక ప్రారంభించారు. తర్వాత చైతన్యం క్రమేపీ వెల్లివిరుస్తూ 2001 మే 1న మహిళలకూ ప్రత్యేక వాకర్స్ హెల్త్ క్లబ్ ఏర్పాటైంది. అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్‌లో నేడు 250 మందికి పైగా సభ్యులుంటే, మహిళా వాకర్స్ క్లబ్‌లో 80 మంది వరకూ సభ్యులున్నారు. వాకర్స్ రోజూ వేకువజామునే రోడ్లపైకి వచ్చి నడక నడుస్తుంటే వారిలో ఓ ఆత్మీయ వాతావారణం అలుముకుంటోంది. మనమంతా ఓ కుటుంబమన్న భావన కలుగుతోంది. ప్రతి ఆదివారం వాకర్స్ అంతా ఓ చోట సమావేశమై ఆరోగ్య సదస్సు నిర్వహించడం, ఓ వైద్య నిపుణుడిని ఆహ్వానించి ఆరోగ్యంపై అవగాహన కల్పించడం చేస్తున్నారు. అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్‌ను గత 28 ఏళ్లలో నిర్వహించిన దాదాపు 15 కార్యవర్గాలు పనిచేశాయి. అయితే కార్యవర్గ సభ్యులు ఎవరైనా కేవలం ఆరోగ్యం అనే ఏకైక లక్ష్యం దిశగానే పనిచేశాయి. ఆయా క్లబ్‌ల్లోని వాకర్స్ అంతా ముందు తమ ఆరోగ్యం, తర్వాత తమ కుటుంబం, ఆ తర్వాత సమాజ ఆరోగ్యం కోసం పరితపించారు. వైద్య నిపుణులతో ఆరోగ్య సదస్సులు నిర్వహించి ఆరోగ్య చిట్కాలు, అనారోగ్యాల నుంచి ఎలా బయట పడాలి అనే అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రయత్నించాయి.

> **నడకతో ఆరోగ్యం, ఐక్యత సాధ్యమైంది**
>
> 
>
> నిత్యం నడకతో మా వాకర్స్‌కు ఆరోగ్యంతో పాటు అందరి మధ్య ఐక్యత కూడా సాధ్యమైంది. మేమంతా ఓ కుటుంబం అనే భావనతో ఆత్మీయత కూడా సాకారమైంది. మా వంతు వ్యక్తిగతంగా ఆరోగ్యం కోసం ప్రయత్నిస్తూనే పట్టణం కూడా ఆరోగ్యంగా ఉండాలని అందరికీ నడక వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నాం.
>
> – పుత్సా కృష్ణ కామేశ్వర్, బులిటెన్ ఎడిటర్, వాకర్స్ హెల్త్ క్లబ్, అమలాపురం

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


డాక్టర్ సునీల్‌కుమార్‌ను సత్కరిస్తున్న వాకర్స్ హెల్త్ క్లబ్‌ల ప్రతినిధులు

అమలాపురం రూరల్: మధుమేహం, రక్తపోటు, కిడ్నీ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పట్టణానికి చెందిన వైద్య నిపుణుడు డాక్టర్ నల్లపాటి సునీల్‌కుమార్ సూచించారు. అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్, మహిళా వాకర్స్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాలలో ఆదివారం ఉదయం జరిగిన ఆరోగ్య సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నిత్యం ఉదయం లేదా సాయంత్రం 30 నిమిషాలు దాటి వాకింగ్ చేస్తే షుగర్, బీపీలకు దాదాపుగా దూరంగా ఉండొచ్చన్నారు. అలాగే మనిషి వయసు, బరువును బట్టి రోజూ తగినంతా తాగునీరు తాగితే కిడ్నీ వ్యాధులకు అడ్డుకట్ట వేయొచ్చన్నారు. ఎప్పటికప్పుడు బీపీ, షుగర్, కిడ్నీ పరీక్షలు చేయించుకుంటూ ఉండాలన్నారు. అనంతరం డాక్టర్ సునీల్‌కుమార్‌ను వాకర్స్ క్లబ్‌ల తరపున సత్కరించారు. సదస్సులో వాకర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ఎస్ఎస్ పద్మావతి, వాకర్స్ ప్రతినిధులు డాక్టర్ పీఎస్ శర్మ, ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, సప్పా నాగేశ్వరరావు, ఉప్పుగంటి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ విజేతలకు అభినందనలు


షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

అమలాపురం టౌన్: రోటరీ యువజన వారోత్సవాల క్రీడా పోటీల్లో అమలాపురం ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ వేసవి ఉచిత క్రీడా శిబిరంలో శిక్షణ పొందిన క్రీడాకారులు షటిల్ బ్యాడ్మింటన్ విభాగంలో విజేతలుగా నిలిచారు. అండర్–13 బాలుర, అండర్–15 బాలికల విభాగాల్లో మొత్తంగా 17 మంది విద్యార్థులు గెలుపొందారు. ఆదివారం స్థానిక ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో విజేతలను ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ మెట్ల వెంకట సూర్యనారాయణ, అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు, కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, కార్యదర్శి ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి రంకిరెడ్డి కాశీ, తిక్కిరెడ్డి సురేష్ అభినందించారు.

పోతవరంలో బడి బాట


పోతవరంలో తల్లిదండ్రులను కలిసిన హెచ్‌ఎం ఆనందరావు

పి.గన్నవరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని పోతవరం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కత్తుల ఆనందరావు అన్నారు. బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలని కోరుతూ ఆదివారం ఆయన ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల తల్లిదండ్రులను కలుసుకుని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న బోధన, మౌలిక సదుపాయాలను వివరించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులు ఆసక్తి కనబరుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎస్టీయూ జిల్లా శాఖ ఆవిర్భావ దినోత్సవం


ఎస్టీయూ జెండాను ఆవిష్కరించిన జిల్లా యూనియన్ కార్యవర్గ ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా ఎస్టీయూ కార్యాలయంలో జిల్లా శాఖ 78వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత జిల్లా కార్యాలయ ఆవరణలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు ఎస్టీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య శిబిరంలో ఉపాధ్యాయులు వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్య పల్లంరాజు, జిల్లా ఎస్టీయూ ఆర్థిక కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివ ప్రసాద్, నల్లా రామకృష్ణ, బోణం గంగాధర్, జనిపెల్ల భీమారావు, నందెపు శ్రీనివాస్, బాలనాగు గుప్తా, వాసంశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల భాషతో భవిష్యత్తులో ప్రయోజనాలు


అంబాజీపేటలో విద్యార్థినికి బహుమతి ఇస్తున్న సీఐ ప్రశాంత్‌కుమార్, ఎంఈఓ-2 ప్రకాష్

అంబాజీపేట: ప్రస్తుత పోటీ ప్రపంచంలో తెలుగుతో పాటు, అధిక ప్రాధాన్యం ఉన్న ఇంగ్లిష్‌ను ప్రతి విద్యార్థి ఇష్టంగా నేర్చుకోవాలని ఎంఈఓ–2 మోకా ప్రకాష్, పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్‌కుమార్ అన్నారు. హైదరాబాద్‌కు చెందిన వినాయక యాడ్స్ ఆధ్వర్యంలో అంబాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో నెల రోజుల పాటు నిర్వహించిన ఉచిత ఇంగ్లిష్, కమ్యునికేషన్ స్కిల్స్ తరగతుల శిక్షణ ముగింపు కార్యక్రమం బొంతు రమేష్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ, సీఐ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న ఇంగ్లిష్‌ను ప్రతి రోజు అభ్యసించడం ద్వారా భవిష్యత్తులో ప్రయోజనం ఉంటుందన్నారు. అనంతరం ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వల్లూరి జ్యోతి, వి.ఐశ్వర్య, ఏఎస్ఎన్ ప్రసన్నకు బహుమతులు, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. శిక్షణా తరగతులకు హాజరైన వారికీ ప్రత్యేక బహుమతులు ఇచ్చారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రావులపాలెం: ఈతకోట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ఏపీ ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ ఆదివారం తెలిపారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈతకోట సెక్షన్ పరిధిలోని గోపాలపురం, ఈతకోట, ముమ్మిడివరప్పాడు, లక్ష్మీ పోలవరం, పొడగట్లపల్లి, మట్లదొడ్డి, దేవరపల్లి, వేదిరేశ్వరం, కోసూరునగర్, గరువు, కేతరాజుపల్లి, చెల్లిరేవు ప్రాంతాల్లో సరఫరా ఉండదని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

త్రిసభ్య కమిటీ సభ్యుల రాజీనామా

ఆలమూరు: మండలంలో ఉన్న ఎనిమిది ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల అధ్యక్షులు, సభ్యులు ఆదివారం తమ పదవులకు రాజీనామా చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్రంలో అధికారం కోల్పోయినందుకు నైతిక బాధ్యత వహిస్తూ, ఆలమూరు, జొన్నాడ, చొప్పెల్ల, చింతలూరు, పెదపళ్ల, మోదుకూరు, నర్సిపూడి, పెనికేరు గ్రామాలకు చెందిన త్రిసభ్య కమిటీ ఈ మేరకు రాజీనామా పత్రాలను సీఈఓల సహకారంతో జిల్లా కలెక్టర్‌కు పంపించారు.

ఘనంగా సోమలింగేశ్వరుని కల్యాణం

ఆత్రేయపురం: ర్యాలి గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత ఉమా సోమలింగేశ్వర స్వామి కల్యాణం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వామివారి కల్యాణం ఘనంగా జరిగింది. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు బాప్టిస్టు చర్చి ప్రతిష్ఠ

యానాం: స్థానిక మెట్టకూరు గణపతినగర్‌లో నూతనంగా నిర్మించిన మదర్ సుశీల మెమోరియల్ బాప్టిస్టు చర్చి రెండో ఫ్లోర్ మందిర ప్రతిష్ఠ సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్‌సాగర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి క్రీమ్ సంస్థ డైరెక్టర్ వసంతరావుతో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో పాస్టర్లు, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పాల్గొంటారన్నారు.

ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

యానాం: పట్టణంలో ఉన్న మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వడానికి ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రెవరెండ్ దొమ్మేటి శామ్యూల్ సాగర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జులై నుంచి డిసెంబర్ వరకూ రోజూ ఉదయం 10 గంటల నుంచి మెట్టకూరు చంద్రశేఖర్ నగర్ బాప్టిస్టు చర్చి ఆవరణలో శిక్షణ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 99854 67999 మొబైల్ నెంబరులో సంప్రదించాలన్నారు.

నీట్ కౌన్సెలింగ్‌పై సెంటాక్ సమాచారమిస్తుంది

యానాం: నీట్ కౌన్సెలింగ్‌కు సంబంధించి వివరాలు, బ్రోచర్, బులిటెన్‌ను సెంటాక్ వెబ్‌సైట్ ద్వారా తెలియజేస్తుంటామని పుదుచ్చేరి సెంటాక్ కన్వీనర్ అమన్‌శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సెంటాక్ ఆఫీసుకు రావాల్సిన అవసరం లేదన్నారు. మెడికల్ కౌన్సిల్ కమిటీ(ఎంసీసీ) ఇచ్చే టైమ్‌లైన్స్‌ను బట్టి కౌన్సెలింగ్ ప్రక్రియను చేపడతామన్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి పారదర్శకతతో నిర్వహిస్తామని, పూర్తి వివరాలు ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో అందిస్తామన్నారు.

ఓటు వేసిన ఫ్రెంచి పౌరులు

యానాం: యూరోపియన్ యూనియన్(ఈయూ) పార్లమెంట్ సభ్యుల ఎన్నికకు ఆదివారం నిర్వహించిన ఎన్నికలో పలువురు యానాం, పుదుచ్చేరి తదితర ప్రాంతాల్లోని ఫ్రెంచి పౌరులు పుదుచ్చేరి ఫ్రెంచి కాన్సులేట్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ఫ్రెంచి పౌరుల ప్రతినిధి సాధనాల బాబు తెలిపారు. యూరోపియన్ యూనియన్‌లో మొత్తం 720 సీట్లు ఉండగా అందులో ఫ్రాన్స్‌కు 81 సీట్లు కేటాయించారన్నారు. యానాంలో ఉన్న పలువురు ఫ్రెంచి పౌరులు ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు.

పనితీరును పునఃపరిశీలించుకోవాలి

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ ఎన్నికలో ఎన్ఆర్ కాంగ్రెస్, బీజేపీ కూటమి అభ్యర్థి పరాజయం పాలవడాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పనితీరును పునఃపరిశీలించుకోవాల్సిన అవసరముందని ఇండిపెండెంట్ ఎమ్మెల్యే నెహ్రూ అలియాస్ కుప్పుస్వామి పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నమశ్శివాయం ఓటమితో ముఖ్యమంత్రి రంగసామి ఇప్పటికైనా కళ్లు తెరవాలన్నారు.

ఓటమికి ఆయన బాధ్యత వహించాలి

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి జరిగిన ఎన్నికలో బీజేపీ అభ్యర్థి లక్షకు పైగా ఓట్ల తేడాతో ఓటమి చెందినందుకు గాను ప్రస్తుత బీజేపీ అధ్యక్షుడు నైతిక బాధ్యత వహించాలని మాజీ బీజేపీ అధ్యక్షుడు స్వామినాథన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీజేపీ నాయకత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరించకపోవడమే ఓటమి కారణమన్నారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు

అమలాపురం రూరల్: నరేంద్ర మోదీ భారత ప్రధానిగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేసిన శుభ సందర్భంగా ఆదివారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో బీజేపీ శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా బీజేపీ సీనియర్ నాయకులు ఆర్‌వీ నాయుడు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దూరి రాజేష్, పట్టణ అధ్యక్షుడు వెంపరాల భాస్కర్ శాస్త్రి, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొండేటి ఈశ్వర్ గౌడ్ స్వీట్లు తినిపించి సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహిళా నారీ శక్తి స్టేట్ కన్వీనర్ చిట్టూరి రాజేశ్వరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాశిన ఫణీంద్ర, యువ మోర్చా ఆర్టీపీ సెల్ స్టేట్ కన్వీనర్ నాగ సుధా కొండలరావు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చిలకమర్తి కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడి.. చేరికల సందడి


అవిడి గ్రామంలో పిల్లల తల్లిదండ్రులకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం అరుణశ్రీ


వేసవి కాలం పోయింది. ఇప్పుడు చదువుల కాలం మొదలు కానుంది. వర్షా కాలంలో కురవాలా, వద్దా అన్నట్టుగా అడపాదడపా వానలు పడుతున్నప్పటికీ.. ప్రైవేటు విద్యాసంస్థల్లో పిల్లలను చేర్చాలంటూ వారి సిబ్బంది మాత్రం తంచనుగా వాలిపోతున్నారు. తమ విద్యాసంస్థే అన్నింటికన్నా గొప్పదంటూ బీరాలు పలుకుతున్నారు. వీరి వాలకం చూసిన సర్కారు బడుల మాస్టార్లు.. మేమేమీ తక్కువ కాలేదంటూ.. ఇంటింటి ప్రచారం మొదలెట్టారు. ఫ్లెక్సీలు, కరపత్రాలు ముద్రించి.. చదువులోనే కాదు.. ప్రచారంలోనూ కార్పొరేట్‌కు దీటుగా జవాబిస్తామంటున్నారు.


- కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- నూతన అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టి
- ప్రైవేట్ సంస్థల తరహాలో ఉత్తమ ఫలితాల ప్రచారం
- 12న పాఠశాలల పునః ప్రారంభం

కొత్తపేట: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల తరహాలో ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. వారికి ఆహ్వానం పలుకుతున్నాయి. ప్రైవేట్ విద్యా సంస్థలకు దీటుగా సర్కార్ పాఠశాలలను తీర్చిదిద్దడంతో, వీటిలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఆ దిశగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఎంఈఓలు మట్టపర్తి హరిప్రసాద్, కె.లీలావతి పర్యవేక్షణలో, ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు విశేష కృషి చేస్తున్నారు.

ఫ్లెక్సీలతో ప్రచారం

పలు ప్రభుత్వ పాఠశాలలు.. ప్రైవేట్ పాఠశాలల తరహాలో వినూత్నంగా ప్రచారం చేపట్టాయి. 2023–24 విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో పలు పాఠశాలల విద్యార్థులు సాధించిన అద్భుత ఫలితాలను ప్రచారాస్త్రాలుగా వినియోగించుకుంటున్నాయి. పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన మెరిట్ విద్యార్థుల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలను ఆయా పాఠశాలల వద్ద ఏర్పాటు చేసి విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఆకట్టుకుంటున్నాయి. వివిధ పోటీ పరీక్షల్లో విద్యార్థుల విజయాలను అందులో ప్రస్తావించారు. ఆయా పాఠశాలల సమీప ప్రాంతాల్లో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి, ప్రభుత్వ పాఠశాలల్లో గడచిన విద్యా సంవత్సరంలో ఉత్తమ ఫలితాలను వివరిస్తూ, ఉత్తమ విద్యార్థులు, వారికి వచ్చిన ఉత్తమ ఫలితాలు, వారి ఫొటోలతో ముద్రించిన కరపత్రాలు పంచుతున్నారు. ఆయా పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు, తమ పాఠశాలల్లో చదువుకోవడం వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నారు. గతంలో తమ పాఠశాల నుంచి ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించిన విద్యార్థులు, నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పొందిన విద్యార్థులు, ముఖ్యంగా తమ పాఠశాలల్లో పిల్లలకు లభించే సదుపాయాలు, పుస్తకాలు, దుస్తులు, ఎనిమిదో తరగతిలో లభించే ట్యాబ్‌లు తదితర వాటిని వివరిస్తున్నారు. పిల్లలను తమ పాఠశాలలో చేర్పించాలంటూ తల్లిదండ్రులను కోరుతున్నారు. తద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తున్నారు.

> **ఒత్తిడి లేని నాణ్యమైన విద్య**
>
> 
>
> ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారు. ఒత్తిడి లేని నాణ్యమైన విద్య లభిస్తోంది. మౌలిక సదుపాయాలు, నూతన సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతుంది. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపొందాయి. ఆయా అంశాలను ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విస్తృతంగా ప్రచారం చేస్తూ తల్లిదండ్రులను చైతన్యపరుస్తున్నారు. అడ్మిషన్లు గణనీయంగా పెంచేందుకు కృషి చేస్తున్నారు.
>
> – మట్టపర్తి హరిప్రసాద్, ఎంఈఓ, కొత్తపేట

> **ప్రగతిని ప్రజల్లోకి తీసుకువెళ్తున్నాం**
>
> 
>
> ప్రభుత్వాలు విద్యకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నాయి. ప్రైవేట్ పాఠశాలల స్థాయిలో ఈ పాఠశాలలను అభివృద్ధి చేసి, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాయి. చదువుకునే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాయి. దానితో పిల్లలు ఆసక్తిగా చదువుకుంటూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. ఈ ఏడాది పదో తరగతి విద్యార్థి ఎస్ నవనీత్ 593/600 మార్కులతో జిల్లా స్థాయి రెండో ర్యాంక్ సాధించాడు. 20 మంది 500 నుంచి 590 వరకూ మార్కులు పొందారు. ఆయా అంశాలన్నీ ప్రజల్లోకి తీసుకువెళ్తున్నాం. అడ్మిషన్లు పెంచేందుకు కృషి చేస్తున్నాం.
>
> – కె.అరుణశ్రీ, హెచ్‌ఎం, జెడ్పీ హైస్కూల్, అవిడి చప్పిడివారిపాలెం